సాక్షి
ములుగు
శుక్రవారం | 29 | డిసెంబర్ | 2023



పత్తిమిల్లులో అగ్ని ప్రమాదం

ములుగు మండలం జాకారం సమీపంలోని రాజరాజేశ్వర కాటన్ ఇండస్ట్రీలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రూ.65 లక్షల నష్టం వాటిల్లింది. - 10లో▸



ప్రాణం తీసిన స్నేక్ డ్రైవ్..

స్నేక్ డ్రైవ్.. ఓ వృద్ధుడి ప్రాణం తీసింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని ఓ యువకుడు స్నేక్ డ్రైవింగ్(మెలికలు తిరుగుతూ) చేస్తూ బైక్‌తో ఢీకొన్నాడు. - 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0° /17.0°

ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కేసుల పరిష్కారానికి సహకరించాలి

ములుగు: జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు అధికారులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ పీవీపీ లలిత శివజ్యోతి తెలిపారు. ఈ మేరకు జడ్జి గురువారం బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్ అధికారులతో వేరు వేరుగా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రేపు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. రాజీపడే కక్షిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, ఒత్తిడికి గురి కాకుండా రాజీమార్గం ద్వారా వారి కేసులను పరిష్కరించుకునేలా అందరూ సహకరించాలన్నారు. లోక్ అదాలత్‌పై ఎలాంటి న్యాయ సలహాలు, సూచనలు కావాలన్నా న్యాయసేవ అధికార సంస్థలను ఆశ్రయించి సలహాలు, సూచనలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి డి.రామమోహన్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ చారి, జనరల్ సెక్రెటరీ మహేందర్, వినయ్ కుమార్, వెంకటేశ్వర్ రావు, భిక్షపతి, సునీల్ కుమార్, స్వామి దాస్, రాంసింగ్, రాజ్ కుమార్, రాజేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ దత్తత చట్టరీత్యా నేరం



ములుగు రూరల్: అక్రమంగా పిల్లలను దత్తత తీసుకోవడం చట్టరీత్యా నేరమని జిల్లా సంక్షేమ అధికారి ఈపీ ప్రేమలత అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలల రక్షా భవన్‌లో దత్తత నూతన మార్గదర్శకాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృత్వం ఒక వరమని, దత్తత అందుకు మారో మార్గమని తెలిపారు. చట్ట ప్రకారం దత్తత తీసుకున్న పిల్లలు తమ పిల్లలే అవుతారని తెలిపారు. దత్తత ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా చేపడతామని వివరించారు. దత్తత ప్రక్రియ పూర్తయ్యే వరకు బాలల పరిరక్షణ సిబ్బంది పరిధిలో ఉంటుందని వివరించారు. దత్తత కోసం దరఖాస్తు చేసుకునే తల్లిదండ్రులు వారి సీనియార్టీని ఆన్‌లైన్‌లో పరిశీలించి వివరాలు తెలుపాలన్నారు. దత్తత ప్రక్రియలో వచ్చిన మార్పులను వివరించారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, హరికృష్ణ, కృష్ణవేణి, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్ సబ్జెక్టును బోధించే అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో జనరల్, ఓబీసీ కేటగిరి వారికి 55శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని వివరించారు. వచ్చే నెల జనవరి 2వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అభ్యర్థులకు ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని, ఎంపిక కోసం ఇంటర్వ్యూ, డెమో క్లాస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూ, డెమో తేదీలు అభ్యర్థులకు ఫోన్ల ద్వారా సమాచారం ఇస్తామని వివరించారు. అభ్యర్థులు దరఖాస్తులను స్వయంగా కళాశాలలో జనవరి 2వ తేదీ లోపు సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్‌లో 9866560840 సంప్రదించగలరు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



కన్నాయిగూడెం: మండల పరిధిలోని పేదలకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతి కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది రిజిస్టర్‌లను తనిఖీ చేసి డ్రగ్ రూమ్, పరీక్ష గదిలో ఉన్న పనిముట్లను పరిశీలించారు. ఆస్పత్రిలోని వార్డులో తిరిగి రోగులకు అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలపై వైద్యాధికారి అభినవ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్రాంతి కుమార్ మాట్లాడుతూ పేదలకు సకాలంలో వైద్యం అందించడంతో పాటు మందులను ఇవ్వాలని సూచించారు. కరోనా రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు.



ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఐహెచ్‌సీ మాజీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కేశవన్ వెలుతాట్, ప్రొఫెసర్ ఆదిత్య ముఖర్జీ, మృదులా ముఖర్జీ, వీసీ తాటికొండ రమేశ్, సెషన్‌కు వస్తున్న ప్రతినిధులు





దేశ భవిత చరిత్రకారులపైన..

- వాస్తవికతను తెలియజేయాల్సిన గురుతర బాధ్యత ఉంది
- నెహ్రూ మెమోరియల్ అండ్ మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్ మృదులా ముఖర్జీ
- కాకతీయ యూనివర్సిటీలో ఐహెచ్‌సీ సెషన్ ప్రారంభం

కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో మూడురోజులపాటు నిర్వహించే ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్(ఐహెచ్‌సీ) 82వ సెషన్ గురువారం ప్రారంభమైంది. ఈ సెషన్‌కు 1,063 పరిశోధనా పత్రాలు వచ్చాయి. దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి చరిత్రకారులు పరిశోధకులు, హిస్టరీ అధ్యాపకులు, యూనివర్సిటీల ఆచార్యులు 1,096మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ముందుగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి రోజు ప్రారంభ సమావేశంలో న్యూఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్, జేఎన్‌యూ హిస్టరీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు మృదులా ముఖర్జీ మాట్లాడారు. 'జవహర్‌లాల్ ఇన్ అవర్ పాస్ట్ ప్రజెంట్ ఫ్యూచర్' అనే అంశంపై ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఆదిత్య ముఖర్జీ ప్రసంగించారు.

- కేయూ క్యాంపస్

- 10లో▸

అభివృద్ధి వైపు అడుగులు..

సమీకృత కలెక్టరేట్ భవనం పనులు ముమ్మరం

- పూర్తి కావస్తున్న 300 పడకల ఆస్పత్రి
- మంజూరైన మెడికల్ కళాశాల
- మేడారం మహాజాతరకు రూ.75 కోట్ల మంజూరు



నిర్మాణంలో ఉన్న సమీకృత కలెక్టరేట్ భవనం

ములుగు: ములుగు జిల్లాలో ఈ ఏడాది అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. స్థానికంగా బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే లేకున్నా అవేమీ పట్టించుకోకుండా సుమారు రూ.1500 కోట్ల పనులకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు, 300 పడకల ఆస్పత్రి పనులతో పాటు మరికొన్నింటి పనులు కొనసాగుతున్నాయి. మిగతా కొన్నింటికి సంబంధించిన పనులు మూలనపడ్డాయి.

సమీకృత కలెక్టరేట్‌కు అనుమతి

జిల్లా కేంద్రంలో అన్ని శాఖలను ఒకే గొడుగు కింద తీసుకరావాలనే ఆలోచనలతో అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వం సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణానికి అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఇందుకుగాను ఆరు 6.05ఎకరాలకు పైగా స్థలాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో కేటాయించారు. నిర్మాణానికి రూ.63.50కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 7వ తేదీన అప్పటి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ముఖ్య అతిథిగా హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు ఎక్కడా ఆలస్యం లేకుండా పనులు చేస్తున్నారు. భవన నిర్మాణ పనులు పూర్తయితే అన్ని శాఖలు ఒకే చోట అందుబాటులో ఉండే అవకాశం ఉంది.

గిరిజన యూనివర్సిటీకి మోక్షం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు మొగ్గ చూపింది. ఇందులో భాగంగా ములుగు మండలంలోని జాకారం పరిధిలో ఇప్పటికే 337.5 ఎకరాల భూమిని ఐటీడీఏ తరఫున కేటాయించగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అప్పగించింది. ఇటీవల సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీగా దానికి నామకరణం చేయడంతో లోక్‌సభతో పాటు, రాజ్యసభలో గెజిట్ నోటిఫికేషన్ బిల్లుకు ఆమోదం రావడంతో వచ్చే ఏడాది నుంచి తరగతులు ప్రారంభించడానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) సిద్ధంగా ఉన్నట్లుగా తెలిసింది. ప్రాథమిక నిర్మాణాలు, తరగతుల ప్రారంభానికి కేంద్రం తరఫున ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం రూ.889 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ములుగు మండలం జాకారంలో తొలి ఏడాది తరగతులు నిర్వహించే అవకాశం ఉంది.



మెడికల్ కళాశాలకు మహర్దశ

వెనుకబడిన జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేయాలన్న ఉద్దేశంతో ములుగు జిల్లా కేంద్రంలో గట్టమ్మ ఆలయం సమీపంలోని ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని రెవెన్యూ అధికారులు అప్పటి ప్రభుత్వానికి నివేదికను అందించారు. దాంతో అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆ పనులకు శంకు స్థాపన చేశారు. అనంతరం రూ.1.80కోట్లతో ప్రాథమిక పనులు చేపట్టేందుకు గత ప్రభుత్వం మొగ్గు చూపి నిధులు మంజూరు చేసింది. అయినా ఇంకా ఆ పనులు ప్రస్తుతం ప్రహరీ స్థాయిలోనే ఉన్నాయి. అదే విధంగా మినీ బస్‌డిపో కోసం రూ.1.20కోట్లు ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు. ఇక బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ భవన నిర్మాణానికి రూ. 50లక్షలు కేటాయించినట్లు జీవో విడుదల అయ్యిందని చెప్పుకున్నప్పటికీ పనులు ఇంకా ముందుకు సాగలేదు.

రూ. 4 కోట్లతో 300 పడకల ఆస్పత్రి

ములుగు జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో 300 పడకల భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి. మూడు విభాగాల్లో నిర్మిస్తున్న ఈ భవానికి రూ. 4 కోట్లు కేటాయించారు. పనులు పూర్తి కావస్తున్నాయి. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ఏరియా ఆస్పత్రి భవనాన్ని మాతా, శిశు కేంద్రంగా కొనసాగించనున్నారు. మెడికల్ కళాశాలతో అనుసంధానంగా పక్కనే నిర్మిస్తున్న 300 పడకల ఆస్పత్రి ఉపయోగకరంగా మారనుంది.



పూర్తి కావొస్తున్న 300 పడకల ఆస్పత్రి

రూ. 75 కోట్లతో మేడారం పనులకు ఆమోదం

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు 21 శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు అందించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహా జాతరకు 68 రోజుల ముందుగా ప్రతిపాదనలకు సంబంధించి రూ.75 కోట్ల నిధులకు ఆమోదం తెలిపింది.

తొలిరోజు 4,420 దరఖాస్తులు

- 'ప్రజా పాలన'కు తరలివచ్చిన ప్రజలు
- ఆరు గ్యారంటీలకు వెల్లువలా అర్జీలు
- పలు గ్రామాల్లోని సభలను పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఎస్‌ఎస్ తాడ్వాయి: దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్

ములుగు/ములుగు రూరల్/గోవిందరావుపేట/వెంకటాపురం(ఎం)/ఎస్‌ఎస్‌తాడ్వాయి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని తొమ్మిది మండలాల్లోని ఆయా గ్రామాల్లో గురువారం సభలు నిర్వహించగా ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈ ప్రజా పాలన సభల్లో అధికారులకు తొలి రోజు 5,700 మంది కుటుంబాలకు గాను 4,420 దరఖాస్తులు అందాయి. 30 గ్రామ పంచాయతీల తరఫున దరఖాస్తులను స్వీకరించిన అధికారులు వాటిని కంప్యూటరైజ్ చేయనున్నారు. ఈ మేరకు అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. నేడు(శుక్రవారం) జరిగే గ్రామ సభలకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీల్లో టాంటాం నిర్వహించామని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలకు దరఖాస్తు ఫారాలను అందించామని వివరించారు.

దరఖాస్తుల స్వీకరణకు 36 బృందాలు

జిల్లాలోని పలు గ్రామాల్లోని సభలను పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తుల స్వీకరణకు 36 బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. దరఖాస్తుదారులకు వివరాలను నమోదు చేసుకొని తప్పని సరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. ఆ రశీదును భద్రపరుచుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. గ్రామాల్లో ప్రతీ వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ప్రజలు దరఖాస్తును నింపి గ్రామ సభలకు హాజరు కావాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఆరు గ్యారంటీలకు కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవాలన్నారు. రేషన్ కార్డు ఉంటేనే దరఖాస్తు చేయాలనే నిబంధన లేదని, ఆధార్ కార్డు జిరాక్స్ ద్వారా కూడా అప్లయ్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

కలెక్టర్ పర్యటించిన గ్రామాలు

ములుగు మండల పరిధిలోని అంకన్నగూడెం, బంజరుపల్లి, బరిగలోనిపల్లి, ముద్దునూరు తండా, గోవిందరావుపేట మండల పరిధిలోని రాఘవపట్నం, వెంకటాపురం(ఎం) మండల పరిధిలోని మల్లయ్యపల్లి, చక్రవర్తిపల్లి, ఎస్‌ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని వెంగ్లాపూర్ జీపీ పరిధిలో ఏర్పాటు చేసిన సభను కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. అధికారులు, ప్రజలకు పలు సూచనలు చేశారు.

సీసీ రోడ్ల పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: సీసీ రోడ్ల నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల పరిధిలోని బయ్యక్కపేటలో గురువారం ఏర్పాటు చేసిన గ్రామ సభకు కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు ఐటీడీఏ పీఓ అంకిత్ హాజరయ్యారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో గ్రామంలోని అభివృద్ధి పనులపై సమీక్షించి కలెక్టర్ మాట్లాడారు. బయ్యక్కపేటలో నాలుగు సీసీ రోడ్లు మంజూరు అయ్యాయని వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల విషయంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వెంటనే ఒక స్పష్టతకు రావాలని, నేడు(శుక్రవారం) వార్డు సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి నివేదిక సమర్పించాలని కార్యదర్శి జ్ఞానేశ్వరిని ఆదేశించారు. అనంతరం మేడారంలో భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ అజయ్‌కుమార్, మేడారం సర్పంచ్ బాబురావు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

- ఐటీడీఏ పీఓ అంకిత్
- కాల్వపల్లి ఆశ్రమ పాఠశాల తనిఖీ



పీఆర్‌శాఖ పనులను పరిశీలిస్తున్న పీఓ అంకిత్



ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న పీఓ

ఎస్‌ఎస్‌తాడ్వాయి: పీఆర్ శాఖ పనుల్లో వేగం పెంచాలని ఐటీడీఏ పీఓ అంకిత్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మేడారం జాతర సందర్భంగా పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ఆయన గురువారం పరిశీలించారు. మేడారంలో వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ స్థలాలు, చేపట్టిన ప్రత్యేక మరమ్మతుల పనులను పరిశీలించారు. ఒప్పందం ప్రకారం ప్రతిపాదిత పార్కింగ్ ప్రదేశాలలో కల్వర్టు పనులు, పొదలు క్లియరెన్స్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాల్వపల్లి రోడ్డు నుంచి ఆర్‌ఎఫ్ చెక్‌పోస్టు వరకు చేపడుతున్న చెట్ల పొదలు తొలగింపు పనులను, ప్రత్యేక మరమ్మతులను పరిశీలించారు. పనులను సక్రమంగా చేపట్టి, దెబ్బతిన్న రోడ్డు మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పీఓ వెంట పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, డీఈ రవీందర్ ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలి

గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలని పీఓ అంకిత్ పాఠశాల ఉపాధ్యాయులను ఆదేశించారు. మండల పరిధిలోని కాల్వపల్లిలో గిరిజన ఆశ్రమ పాఠశాలను పీఓ గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనుల స్థితిగతులపై డిప్యూటీ వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులను పరిశీలించి పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, స్కూల్ యూనిఫాంల సరఫరా, టైం టేబుల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయడం తదితర విషయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. సోలార్ వాటర్ హీటర్, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ పని చేయడం లేదని వార్డెన్ చెప్పగా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలకు అండగా నిలిచేది కాంగ్రెస్సే..

- డీసీసీ అధ్యక్షుడు అశోక్



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న అశోక్

ములుగు: అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీయే అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి గాంధీ చౌక్ వద్ద పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు, ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య పోరాటంలో బ్రిటీష్ వారిపై ఒత్తిడి తీసుకొచ్చి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన ఘనత గాంధీ కుటుంబానిదే అన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలైన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షకిల్ పాషా, షర్ఫోద్దీన్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్, మావూరపు తిరుపతిరెడ్డి, బోడ రఘు, అశోక్, ఇమ్మడి రాజుయాదవ్, ఓం ప్రకాష్, బొంతల వేణు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ జన్మభూమి అక్షింతల శోభాయాత్ర

టేకుమట్ల: శ్రీరామ జన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మండలకేంద్రంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర మండల సంచాలన సమితి ఆధ్వర్యంలో టేకుమట్ల హనుమాన్ టెంపుల్ నుంచి రామకృష్ణాపురం టి గ్రామం వరకు గురువారం ఊరేగించారు. ఈ కార్యక్రమంలో చుట్టు పక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

క్లుప్తంగా

అధ్యాపకులకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

హసన్‌పర్తి : నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో రెండు రోజులు నిర్వహించనున్న అధ్యాపకుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. 'గిట్ హబ్ కోడ్ స్పేస్' అనే అంశంపై ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఐటీ రంగ శిక్షకురాలు జిజ్ఞాస దలాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గిట్ హబ్ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఎస్సార్ యూనివర్సిటీ సీఎస్సీ విభాగాధిపతి డాక్టర్ శశికళ మాట్లాడుతూ ఈ సదస్సు అధ్యాపకులకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ సురేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నీలిమ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

లింగాలఘణపురం: మండలంలోని కుందారం గ్రామానికి చెందిన సజ్జన నర్సయ్య (40) తన వ్యవసాయ బావి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నర్సయ్య హైదరాబాద్‌లో కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం గ్రామంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చి వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నానని చెప్పి అక్కడే చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. పోలీసులు మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఆధార్ అప్‌గ్రేడ్ పేరుతో అక్రమ వసూళ్లు..

గూడూరు: ఆధార్ అప్‌గ్రేడ్ పేరుతో కొందరు వ్యక్తులు అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. ఈ ఘటన గురువారం మండల కేంద్రం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోని చెంద్రుగూడెంలో ఓ ఇంటికి మరో మండలానికి చెందిన వ్యక్తులు కంప్యూటర్, జిరాక్స్ మిషన్‌తో పాటు చేరుకున్నారు. తాము ఆధార్ అప్‌గ్రేడ్ వెంటనే చేస్తామని, అందుకు రూ. 200 అవుతుందని తెలిపారు. ప్రజాపాలనలో దరఖాస్తులకు ఆధార్ తప్పిదాలు ఉంటే సరి చేసుకునేందుకు మీ సేవా కేంద్రాల్లో ఆలస్యం అవుతుందని, తాము వెంటనే చేయిస్తామని చెప్పి కొందరి ఆధార్‌తో పాటు డబ్బులు తీసుకుని అప్‌గ్రేడ్ చేయడం ప్రారంభించారు. ఈ విషయం ఓ వ్యక్తి తహసీల్ కార్యాలయ గ్రూప్‌లో పోస్టు చేశారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న అప్‌గ్రేడ్ చేస్తున్న వ్యక్తులు వెంటనే ఆ ఇంటి నుంచి వెళ్లారు. సాయంత్రం తహసీల్దార్ అశోక్‌కుమార్ ఆ అప్‌గ్రేడ్ చేసిన వారి వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా సదరు వ్యక్తులు సాయంత్రం వరకు 50 మంది ఆధార్ కార్డులు అప్‌గ్రేడ్ చేసినట్లు ప్రచారం. తహసీల్ కార్యాలయానికి సమాచారం లేకుండా ఆధార్ అప్‌గ్రేడ్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన వారు నెక్కొండ మండలానికి చెందిన వారని తెలిసింది.


స్టాల్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న ప్రతినిధులు



ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌కు వస్తున్న ప్రతినిధులు


కేయూ ఆడిటోరియంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దేశ భవిత చరిత్రకారులపైన..

- వాస్తవికతను తెలియజేయాల్సిన గురుతర బాధ్యత ఉంది
- మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్ మృదులాముఖర్జీ
- కేయూలో ఐహెచ్‌సీ సెషన్ ప్రారంభం


వేదికపై ఆసీనులైన అతిథులు

కేయూ క్యాంపస్: దేశంలో చరిత్ర వక్రీకరణలు జరుగుతున్నాయని, వీటికి వ్యతిరేకంగా వాస్తవిక చరిత్రను తెలియజేయాల్సిన గురుతర బాధ్యత చరిత్రకారులపై ఉందని, ఈ దేశ భవిత చరిత్రకారులపై ఆధారపడి ఉందని న్యూఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్, జేఎన్‌యూ హిస్టరీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ మృదులా ముఖర్జీ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని ఆడిటోరియంలో మూడు రోజులు నిర్వహించే ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్ గురువారం ప్రారంభమైంది. ఈ సెషన్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా లౌకిక, సోషలిస్టు, ప్రజాస్వామిక, మౌలిక భావనల పవిత్రను కాపాడాల్సిన బాధ్యత చరిత్రకారుల భుజస్కందాలపై ఉందన్నారు. లౌకిక, శాస్త్రీయ దృక్పథంతోనే ఐహెచ్‌సీ ముందుకెళ్తుందన్నారు. భారత జాతీయ ఉద్యమంపై పరిశోధన సందర్భంగా తాను బిపిన్ చంద్ర, తదితరులతో కలిసి 1984లో తెలంగాణ ప్రాంతంలో పర్యటించామన్నారు. అప్పటి సాయుధ పోరాట యోధులైన పలువురిని రావినారాయణరెడ్డిలాంటి వారితో కలిసి ఇంటర్వ్యూలు కూ డా చేసినట్లు తెలిపారు. చరిత్రకారులు పక్షపాతంలేకుండా వాస్తవిక చరిత్రను వెలుగులోకి తీసుకురావాలన్నారు. దేశంలోని వివి ధ పరిస్థితులు చూస్తుంటే రాబోయే కాలంలో చరి త్రకారులకు మరింత ఇబ్బందులు కలిగించే పరిస్థితులు చవిచూడాల్సి వస్తుందన్నారు. అలాంటి ఇబ్బందులు ఎదుర్కొని వాస్తవిక చరిత్రను రాయాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఓరుగల్లు.. కాకతీయుల చరిత్ర కలిగిన ప్రాంతమన్నారు. ఈ ప్రాంతంలో చారిత్రక పర్యాటక ప్రాంతాలు చాలా ఉన్నాయని, వాటి చరిత్రను కూడా యువచరిత్రపరిశోధకులు తెలుసుకోవాలని ఆమె సూచించారు.

నెహ్రూ విధానాలపై మతతత్వశక్తుల దాడి

మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ భావజాలం, విధానాలపై నేడు మతతత్వశక్తులు పెద్ద ఎత్తున దాడులు చేస్తున్నాయని ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఆదిత్యముఖర్జీ అన్నారు. ఐహెచ్‌సీ ప్రారంభ సమావేశంలో జనరల్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం 'జవహర్‌లాల్ ఇన్ అవర్ పాస్ట్ ప్రజెంట్ ఫ్యూచర్'అనే అంశంపై ప్రసంగించారు. భారత దేశం నేడు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు జవహర్‌లాల్ నెహ్రూ కారణమనే విధంగా మతత్వశక్తులు ప్రచారం చేస్తున్నారన్నారు. దేశ విభజన, భారత్‌- చైనా, కాశ్మీర్ సమస్యల వివాదానికి కూడా నెహ్రూ కారణమనే విధంగా మతతత్వ శక్తులు ఆయన విధానాలపై దాడులు చేస్తున్నాయన్నారు. విద్యారంగం వెనుకబడడానికి కూడా నెహ్రూనే కారణమనే విధంగా అసత్య ప్రచారం చేస్తున్నాయన్నారు. నెహ్రూ జ్ఞాపకాలను చెరిపే యత్నం చేస్తుండడం చూస్తున్నామన్నారు. ఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ అండ్ మ్యూజియం పేరులో నెహ్రూ పేరును తొలగించి ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియంగా మార్చారని గుర్తుచేశారు. 75 సంవత్సరాల భారత దేశ స్వాతంత్ర్య పోరాట పోస్టర్‌లో నెహ్రూ ఫొటోను కూడా లేకుండా చేశారన్నారు. వి.డి సావర్కర్ ఫొటోపెట్టారన్నారు. నాడు నెహ్రూ మైనార్టీ, మెజార్టీ మతతత్వాలను వ్యతిరేకించారన్నారు. రెండు మతాలు కూడా ఒకదానికొకటి పోషించుకుంటాయని, ఒకరినొకరు విమర్శించుకుంటూ పార్లమెంట్, అసెంబ్లీలో ప్రజావ్యతిరేక చట్టాలను రూపొందించుకోవడంలో సహకరించుకుంటాయని విమర్శించారు. దేశం నేడు సాధించిన శాస్త్ర, సాంకేతిక రంగాల ప్రగతి నాడు నెహ్రూ అనుసరించిన వి ధానాలతోనే అన్నారు. ఐఐటీలు, ఐఐఎంలు, సీఎస్ఐఆర్ అటామిక్ ఎనర్జీ కమిషన్, డీఆర్‌డీవో, నేషనల్ ఫిజికల్ లేబరేటరీ, నేషనల్ కెమిస్ట్రీ లేబరేటరీ లాంటి అనేక పరిశోధన సంస్థలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు.

పలువురికి బహుమతులు, అవార్డుల అందజేత

2022 సంవత్సరంలో మద్రాస్‌లోని క్రిస్టియన్ కాలేజీలో జరిగిన చివరి సమావేశంలో పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి ఈ సమావేశంలో అవార్డులు, బహుమతులు అందజేశారు. ప్రొఫెసర్ రామచంద్రగుహ జీవిత కాల సాఫల్య పురస్కారం కూడా ప్రకటించారు. ఈ సందర్భంగా ఒడిశాకు చెందిన దివంగత ప్రసన్న కుమార్‌బిస్వాల్ జ్ఞాపకంగా ఆయన సతీమణి భారత చరిత్ర కాంగ్రెస్ పేరున రూ. లక్ష విరాళం అందించారు.వేదిక కార్యదర్శి ఎస్‌కే ఎస్ ఏ నదీమ్‌రిజావికి అందజేశారు. కార్యక్రమానికి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి హరగోపాల్, కేయూ మాజీ వీసీ వి గోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ మురళీమనోహర్, హిస్టరీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ శ్రీనాథ్, ప్రముఖ చరిత్రకారులు హాజరయ్యారు.


సెమినార్‌కు హాజరైన ప్రతినిధులు

శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేయాలి

శాస్త్రీయ దృక్పథంతో చరిత్రను అధ్యయనం చేయాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ అన్నారు. చరిత్రను వర్తమానం నుంచి భవిష్యత్ తరాలకు అందించే గురుతర బాధ్యతను చరిత్రకారులే నిర్వర్తిస్తున్నారన్నారు. దేశ సంస్కృతి, అభివృద్ధిలో చరిత్ర పాత్ర గణనీయమైందన్నారు. తెలంగాణ ఎంతో గొప్ప చరిత్ర కలిగి ఉందన్నారు. కాకతీయుల కాలం నాడు సమక్క,సారలక్క పోరాటం, తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ, ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన కొమురం భీమ్ లాంటివాళ్లను గుర్తుచేశారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సదస్సులకు ఎల్లప్పుడు కాకతీయ యూనివర్సిటీ ముందువరుసలో ఉంటుందన్నారు. మూడురోజులు జరిగే ఈ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌లో దేశానికి ఉన్నత సందేశం అందించాలని కోరారు. సమావేశంలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెక్రటరీ సయ్యద్ అలీనదీమ్ రిజావి, ఐహెచ్‌సీ లోకల్ సెక్రటరీ టి మనోహర్. ఐహెచ్‌సీ మాజీ జనరల్ ప్రెసిడెంట్లు ప్రొఫెసర్ కేశవన్ వెలుతాట్ (కేరళ) కెఎం శ్రీమాలి మాట్లాడారు. వేదిక మీద ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ కార్యవర్గం(ఎగ్జిక్యూటివ్ బాడీ)బాధ్యులు ఉన్నారు. ఈనెల 29, 30న కూడా కొనసాగనుంది.

కేయూ ఆడిటోరియం వద్ద ప్రతినిధుల సందడి

కేయూలో గురువారం ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్ ప్రారంభమైంది. మూడురోజులు జరిగే ఈ సెషన్‌కు 1063 పరిశోధన పత్రాలు వచ్చాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి చరిత్రకారులు, పరిశోధకులు, హిస్టరీ అధ్యాపకులు, యూనివర్సిటీల ఆచార్యులు 1096 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో కొందరు ఆన్‌లైన్‌లో చేసుకోగా మరికొందరు నేరుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరికి నగరంలో వివిధచోట్ల వసతి కల్పించారు. కొందరికి యూనివర్సిటీలోనే హాస్టళ్లలో వసతి కల్పించారు. ఆడిటోరియంలో జరిగిన ఐహెచ్‌సీకి వచ్చిన వారితో సందడి నెలకొంది. ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

బుక్ ఫెయిర్

కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియం వద్ద వివిధ ప్రచురణ సంస్థలు బుక్ ఫెయిర్ నిర్వహించాయి. వివిధ చారిత్రక పుస్తకాలు కూడా అందుబాటులో ఉంచారు.వీటివద్ద కూడా సందడి కనిపించింది.







ఐహెచ్‌సీ సెషన్‌లో మాట్లాడుతున్న కేయూ వీసీ రమేశ్, ఐహెచ్‌సీ సెక్రటరీ సయ్యద్ అలీనదీమ్‌రిజావి, కేశవన్ వెలుతాటి, కేఎం శ్రీమాలి, ముఖ్యఅతిథి మృదులా ముఖర్జీ, ఇండియన్ హిస్టరీ ప్రెసిడెంట్ ఆదిత్య ముఖర్జీ

ఐహెచ్‌సీలో విదేశీ ప్రతినిధులు..

కాకతీయ యూనివర్సిటీలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82 సెషన్‌కు ఇద్దరు విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. వీరిలో మహమ్మద్ ఆహ్మద్ (ఉజ్బెకిస్తాన్), రీతు కందూరి(అమెరికా సంయుక్త రాష్ట్రాలనుంచి)హాజరయినట్లు లోకల్ సెక్రటరీ టి మనోహర్ తెలిపారు.

ప్రొసీడింగ్స్ సంపుటి ఆవిష్కరణ

ప్రముఖ చరిత్ర కారుడు రామచందర్ గుహకు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించారు. 81వ సెషన్‌లో జరిగిన ప్రొసీడింగ్స్ (పరిశోధన పత్రాల) సంపుటిని(పుస్తకం)ఆవిష్కరించారు. ఆ సెషన్‌లో పత్రాలు సమర్పించిన వారికి ఏడుగురికి ఉత్తమ పుస్తకాలకు, 10మందికి ఉత్తమ పత్రాలకు అవార్డులు ,నగదు బహుమతులు అందజేశారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో యాన్సింట్ ఇండియా, మోడర్న్ ఇండియా, ఆర్కియాలజీ, కాంటెంపరరీ ఇండియా అనే అంశాలపై పరిశోధన పత్రాల సమర్పించారు.





ప్రతినిధులకు అవార్డులు ప్రదానం చేస్తున్న అతిథులు

ప్రాణం తీసిన స్నేక్ డ్రైవ్ ..

- వృద్ధుడిని ఢీకొన్న బైక్.. తీవ్ర గాయాలు
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

ఖిలా వరంగల్ : స్నేక్ డ్రైవ్.. ఓ వృద్ధుడి ప్రాణం తీసింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని ఓ యువకుడు స్నేక్ డ్రైవింగ్(మెలికలు తిరుగుతూ) చేస్తూ బైక్‌తో ఢీకొన్నాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన వృద్ధుడిని పోలీసులు వెంటనే ఆస్పత్రికి తరలిస్తుంగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈఘటన వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఆర్టీఏ జంక్షన్ సమీపంలో జరిగింది. మిల్స్‌కాలనీ ఎస్సై వెంకన్న కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేట గ్రామానికి చెందిన సముద్రాల వీరమల్లు(70) వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలో నిర్మిస్తున్న సన్ షైన్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం హోటల్‌లో భోజనం చేసేందుకు హనుమకొండ వైపు నుంచి ఆర్టీఏ జంక్షన్‌కు నడుచుకుంటూ వస్తున్నాడు. ఈక్రమంలో హనుమకొండ నుంచి బైక్‌పై అతివేగం, స్నేక్ డ్రైవ్‌తో ఆర్టీఏ జంక్షన్ వైపునకు వెళ్తున్న వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన దినేష్.. వీరమల్లును వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో వీరమల్లుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ ఎస్సై వెంకన్న హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించి క్షతగాత్రుడిని 108లో ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈఘటనపై మృతుడి కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.


క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న ఎస్సై వెంకన్న

పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం

- సుమారు రూ.65 లక్షల మేర నష్టం
- జాకారం సమీపంలో ఘటన

ములుగు రూరల్ : ములుగు మండలం జాకారం సమీపంలో ఉన్న రాజరాజేశ్వర కాటన్ ఇండస్ట్రీలో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు రూ.65 లక్షల మేర నష్టం వాటినట్లు సీసీఐ అధికారులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సీసీఐ ద్వారా నెల రోజుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని రాజరాజేశ్వర మిల్లులో నిల్వ చేశారు. మిల్లు నడుస్తున్న క్రమంలో ఏయిర్ కంప్రెషర్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు అంటుకున్నాయి. దీంతో లోపలి నుంచి మంటలు వ్యాప్తి చెంది బయట షెడ్డులో నిల్వ చేసిన పత్తికి అంటుకున్నాయి. దీంతో పొగ రావడంతో కూలీలు గమనించి కేకలు వేశారు. యాజమాన్యం అప్రమత్తమై ఫైర్ సెఫ్టీ సిలిండర్లతో మంటలు అదుపు చేసే ప్రయత్నం చేశారు. అనంతరం అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో ములుగు, పరకాల, నర్సంపేటకు చెందిన అగ్ని మాపక సిబ్బంది వచ్చి సహాయక చర్యలు చేపట్టాయి.


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సుమారు రూ. 65 లక్షల మేర నష్టం..

రాజరాజేశ్వర కాటన్ ఇండస్ట్రీలో రూ. 2కోట్ల విలువైన పత్తి నిల్వ ఉన్నట్లు సీసీఐ అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించిన ఘటనలో సుమారు రూ. 65 లక్షల విలువైన పత్తి అగ్నికి ఆహుతైందని తెలిపారు. దీంతో మిల్లు యజమాని నల్లెల్ల రవికి భారీ నష్టం వాటిల్లింది. కాగా, సమయానికి ఫైర్ సెఫ్టీ, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని రూ. కోటీ 40 లక్షల విలువైన పత్తిని కాపాడారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బుధ, గురువారాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

-సాక్షి నెట్‌వర్క్


సమ్మయ్య నాయక్ (ఫైల్)


మహాముత్తారం: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం రాత్రి మండలంలోని బోర్లగూడంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ముక్‌లోత్ సమ్మయ్యనాయక్(55) బైక్‌పై మండలంలోని పెగడపల్లి గ్రామానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ బోర్లగూడెం గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి పక్కన ఉన్న కల్వర్టును ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలు కావడంతో సమ్మయ్య నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

ఏటూరునాగారంలో యువకుడు..


అనిల్(ఫైల్)

ఏటూరునాగారం : ములుగు జిల్లా మల్లంపల్లి సమీపంలోని 163 జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొన్న ఘటనలో గాయపడిన ఏటూరునాగారానికి చెందిన మల్యాల అనిల్‌కుమార్(27) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఏటూరునాగారం మండలంలోని రొయ్యూర్‌కు చెందిన కరీం, మండల కేంద్రానికి చెందిన మల్యాల అనిల్‌కుమార్ పని నిమిత్తం బుధవారం వరంగల్ వెళ్లారు. పనులు ముగించుకుని ఏటూరునాగారం వస్తుండగా మల్లంపల్లి వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. దీంతో అనిల్‌కు తీవ్రగాయాలు కాగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, నాగయ్య, సమ్మక్క దంపతుల పెద్ద కుమారుడు అనిల్ ఆధార్ సెంటర్ నడుపుకుంటూ కుటుంబానికి ఆసరా అవుతున్నారు.

విశ్వనాథపురంలో మరో యువకుడు..


నర్సింగరావు (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మండలంలోని శివునిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు గుర్రపు నర్సింగరావు(33) పని నిమిత్తం బైక్‌పై ఘన్‌పూర్ వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వస్తుండగా శివునిపల్లిలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొంది. ఈ ఘటనలో నర్సింగరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతుడి కుటుంబీకులు సమాచారం అందించగా ఘటనా స్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య అన్నపూర్ణ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు బాబురావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సట్ల రాజు గురువారం తెలిపారు. కాగా, నర్సంగరావు మృతిపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య, జెడ్పీటీసీ మారపాక రవి, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, ఘన్‌పూర్ సర్పంచ్ సురేష్‌కుమార్, గుర్రం యేసుబాబుతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సంతాపం తెలిపారు.